పుస్తకావిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: విరాట్ విశ్వకర్మ జయంతి సందర్భంగా ఉప్పుగూడలో విశ్వబ్రాహ్మణ/విశ్వకర్మ సంఘం నిర్వహించిన విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా సంఘం సంయుక్త కార్యదర్శి జెల్లిపల్లి శ్రీనివాస్ చారి రచించిన 'నిలువుటద్దం నిత్య చైతన్య మినీ కవితలు'పుస్తకాన్ని తెలంగాణ రాష్ట్ర విశ్వకర్మ సంఘ ప్రముఖులు ఆవిష్కరించారు.

28న స్విట్జర్లాండ్‌లో బతుకమ్మ ఉత్సవాలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

గన్‌ఫౌండ్రీ: బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అని తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ నెల 28న స్విట్జర్లాండ్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాల వాల్‌పోస్టర్‌ను బుధవారం రవీంద్రభారతిలో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఈ నెల 28న స్విట్జర్లాండ్‌లో జరిగే బతుకమ్మ ఉత్సవాలకు మంత్రిని ఆహ్వానించగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో స్విట్జర్లాండ్ తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు బ్రహ్మానందరెడ్డి, డీఆర్‌కే విశ్వకర్మ తదితరులు పాల్గొన్నారు.

వసి ఉర్ రెహ్మాన్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



అవార్డు అందుకున్న వసి ఉర్ రెహ్మాన్

చార్మినార్: 56 ఏళ్లుగా విద్యారంగంలో ఉంటూ విద్యార్థులందరికీ గుణాత్మకమైన విద్యనందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న తమకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించిందని డాన్ గ్రూప్ ఆఫ్ స్కూల్ డైరెక్టర్ వసి ఉర్ రెహ్మాన్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా ఈ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నామన్నారు. ఈ అవార్డు తమపై మరింత విద్య బాధ్యతలను పెంచిందన్నారు. ఈ అవార్డుల కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన తదితరులు పాల్గొన్నారన్నారు.

మహిళ, శిశువుల సంరక్షణకు ప్రత్యేక శిబిరం ఏర్పాటు



శిశువులకు వైద్య చికిత్సలు అందిస్తున్న డాక్టర్ చంద్రారెడ్డి

నాంపల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'ఆరోగ్య మహిళ-శక్తివంతమైన కుటుంబం'అనే కార్యక్రమాన్ని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం నాంపల్లి ఏరియా ఆసుపత్రిలో నిర్వహించారు. సెప్టెంబరు 17న ప్రారంభమైన ఈ కార్యక్రమం అక్టోబరు 2వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇందులో భాగంగా మహిళ, శిశువుల సంరక్షణకు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రారెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు రోగులకు వైద్య చికిత్సలు అందించారు.

అన్నదానం



చార్మినార్: కుంభమేళా అగర్వాల్ బంధు, అశోక్ ఫౌండేషన్ పితృ పక్ష ఏకాదశిని స్మారక దినోత్సవంగా జరుపుకుంటున్నామని ఫౌండేషన్ అధ్యక్షుడు పంకజ్ కుమార్ అగ్రవాల్ అన్నారు. స్మారక దినోత్సవం సందర్భంగా రికాబ్‌గంజ్‌లోని భండారా చౌక్‌లో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర నర్నొలి, రోహిత్ అగర్వాల్, రాజ్‌కమల్, అనూప్ అగర్వాల్, సుదీప్ రాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మరో ప్రమాదం జరగకుండా..

90001 13667

- మ్యాన్ హోల్‌కు మూతలు లేకపోతే ఫోన్ చేయండి
- హైడ్రా అధికారుల ముందస్తు జాగ్రత్తలు
- జీహెచ్‌ఎంసీ, జలమండలి పర్యవేక్షణలో 2 రకాల మ్యాన్‌హోళ్లు
- ఇకపై మూతలు లేని మ్యాన్‌హోళ్లు కనిపించడానికి వీలు లేదు: హైడ్రా



చార్మినార్: యాకుత్‌పురా మౌలాకా చిల్లా మ్యాన్‌హోల్ ప్రమాదం అంశం తెరపైకి రావడంతో ప్రభుత్వం సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇక ముందు ఎక్కడ మ్యాన్‌హోళ్లపై మూతలు లేకున్నా.. 90001 13667కు ఫోన్ చేయాలని హైడ్రా కోరింది. యాకుత్‌పురా సంఘటనపై వెంటనే స్పందించిన హైడ్రా కమిషనర్ ఏవీ. రంగనాథ్ నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. మూతల్లేని మ్యాన్‌హోల్స్ విషయంలో స్థానికులు ఫిర్యాదు చేయడానికి ఈ నెంబర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు హైడ్రా స్పష్టం చేసింది.

స్థానికులకు అవగాహన కల్పించాలి..

ప్రమాదాలకు నిలయంగా మారుతున్న మ్యాన్‌హోళ్లను సరిచేయించడానికి ముందుకు వచ్చే ఫిర్యాదుదారుల సౌకర్యార్థం సంబంధిత అధికారులు స్థానికులకు అవగాహన కల్పించాల్సి ఉంది. డ్రైనేజీ సమస్యలు తలెత్తినప్పుడు సాధారణంగా జీహెచ్‌ఎంసీకి ఫిర్యాదు చేస్తుంటారు. అలా కాకుండా అది జలమండలికి చెందినదా..లేక జీహెచ్‌ఎంసీకి చెందినదా..అని తెలుసుకున్న తర్వాతే ఫిర్యాదు చేస్తే..ఆయా సమస్యల పరిష్కారం తొందరగా జరుగుతుంది. ఇక ఈనెల 11న ఉదయం స్కూల్‌కు వెళ్తున్న చిన్నారి ప్రమాదావశాత్తు మ్యాన్‌హోల్‌లో పడి గాయాలకు గురికావడంతో..అది జీహెచ్‌ఎంసీకి చెందిన మ్యాన్‌హోలా..? జలమండలికి చెందినదా..? అనే విషయాలను తెల్సుకోలేకపోయారు స్థానికులు. యాకుత్‌పురాలోని మౌలాకా చిల్లాలో తెరిచి ఉంచిన మ్యాన్‌హోల్ విషయం తెరపైకి రావడంతో ఏ మ్యాన్‌హోల్ ఎవరి పరిధిలో ఉంటుందనే విషయాలను పాఠకుల సౌకర్యార్థం తెలియజేస్తున్నాం.

మూతలను బట్టి..

మ్యాన్‌హోల్ మూతలు రెండు రకాలుగా ఉంటాయి. రౌండ్‌గా ఉంటే..జలమండలికి చెందినవిగా..చతురస్రాకారంలో ఉన్న మూతలు జీహెచ్‌ఎంసీకి చెందినవి మనుగడలో ఉన్నాయి. మ్యాన్‌హోళ్లు జలమండలి, జీహెచ్‌ఎంసీ ప్రభుత్వ విభాగాల పర్యవేక్షణలో కొనసాగుతున్నాయి. డ్రైనేజీ మురుగు నీటి పైప్‌లైన్ల మ్యాన్‌హోళ్లతో పాటు కచ్చా మోరీ మ్యాన్‌హోళ్ల మూతలు అందుబాటులో ఉన్నాయి. ఎక్కడైనా మూతలు లేని మ్యాన్‌హోల్స్ ఉంటే వెంటనే బిగించాలని హైడ్రా కమిషనర్ జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి



సిద్దిఅంబర్‌బజార్‌లో పూజలు చేస్తున్న అధ్యక్షుడు రఘుచారి తదితరులు



ఉప్పుగూడలో ధ్వజారోహణ చేస్తున్న పురోహితులు



వేడుకల్లో ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు



వేడుకల్లో సాయిబాబా చారి తదితరులు

అబిడ్స్: విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం విశ్వకర్మ స్వర్ణకార సొసైటీ ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ మహోత్సవం చేపట్టారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీఆర్‌ఎస్ గోషామహల్ నియోజకవర్గం నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో స్వర్ణకార సొసైటీ అధ్యక్షులు అనంతోజు హరిప్రసాద్, చేపూరి జగన్‌చారి, భాస్కరచారి, ప్రదీప్‌కుమార్, సంతోష్‌చారి, ప్రకాష్ చారి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుగూడలో..

చాంద్రాయణగుట్ట: విశ్వకర్మ జయంతి సందర్భంగా ఉప్పుగూడలోని సుబ్రహ్మణ్య విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో బుధవారం విరాట్ విశ్వకర్మ పూజ, ధ్వజారోహణం, యజ్ఞ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం విశ్వకర్మ భగవానుని ఊరేగింపు కొనసాగింది. ఉత్సవానికి రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సేకరణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్, స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇంజమూరి రాఘవచారి హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దాసోజు కనకాచారి, ప్రధాన కార్యదర్శి తోట శ్రీనివాసాచారి, కోశాధికారి బోనాల మధుసూదన్ చారి తదితరులు పాల్గొన్నారు.

సిద్దిఅంబర్‌బజార్‌లో..

జియాగూడ: సిద్దిఅంబర్‌బజార్‌లోని స్వర్ణకార సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ భగవానుడి విగ్రహంకు ప్రత్యేక పూజలు, హోమం, హారతి, చివరగా అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బొడ్డుపల్లి రఘుచారి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌చారి, కోశాధికారి సంతోష్‌చారి, ఉపాధ్యక్షులు వేణుగోపాల్, సంయుక్త కార్యదర్శి సురేష్, కార్యనిర్వాహక కార్యదర్శి హరీష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

విరాట్ విశ్వకర్మ ఆలయంలో..

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో విశ్వకర్మ స్వామి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. శ్రీ విరాట్ విశ్వకర్మ ఆలయంలో జరిగిన ఈ వేడుకల్లో జగదాంబిక మహంకాళి ఆలయ వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షులు బి.సాయిబాబా చారి, విశ్వకర్మ స్వామి సేవా సమితి అధ్యక్షుడు బ్రహ్మశ్రీ గోల్కొండ శ్రీకాంత్‌చారి, యాదగిరిచారి, సురేశ్ చారి పాల్గొన్నారు.

పెండింగ్ పనులను పూర్తి చేయాలి



బల్దియా కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ బల్దియా కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఆయన బల్దియా కమిషనర్ ఆర్.వి.కర్ణన్‌ను కలిశారు. కార్వాన్ నియోజకవర్గంలోని 39 ప్రాంతాల్లో రూ.10 కోట్ల పనులు అసంపూర్తిగా మిలిగిపోయాయని..దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రజాప్రతినిధిగా తన కర్తవ్యాన్ని నిలబెట్టుకోవడానికి వివిధ శాఖల ద్వారా నిధులు కేటాయిస్తున్నానని..అయితే అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పనులు సకాలంలో పూర్తి కావడం లేదన్నారు. కార్వాన్, జియగూడ, లంగర్‌హౌజ్, గోల్కొండ, టొలిచౌకీ తదితర డివిజన్లలో నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తి చేయించాలని కోరారు. ఆయా జోన్ల అధికారులతో మాట్లాడి పనులను పూర్తి చేయిస్తానని కమిషనర్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

బీజేపీ హయాంలో క్రీడలకు ప్రోత్సాహం



క్రీడాకారులతో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు

గోల్కొండ: బీజేపీ హయాంలో క్రీడలకు ప్రోత్సాహం లభిస్తుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం గుడిమల్కాపూర్ తాళ్లగడ్డ కబడ్డీ స్టేడియంలో బీజేపీ నాయకుడు దేవర వంశీ ఆధ్వర్యంలో స్వచ్ఛతా సేవా పఖ్వాడాలో భాగంగా నమో వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పదేళ్ల మోదీ పరిపాలనలో ఎన్నో క్రీడాంశాలలలో విశ్వ విజేతగా నిలిచిందన్నారు. టీం ఈవెంట్లతో పాటు వ్యక్తిగత పోటీల్లో సైతం మన దేశ క్రీడాకారులు అంతర్జాతీయ పోటీల్లో త్రివర్ణ పతకాన్ని ఎగరవేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుండే తదితరులు ఉన్నారు.

హెచ్‌సీఏ అక్రమాలపై విచారణ కమిటీ వేయాలి

గన్‌ఫౌండ్రీ: 2005 నుంచి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలను నిగ్గు తేల్చేందుకు ఉన్నత స్థాయి విచారణ కమిటీ వేయాలని తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి భారత్ క్రికెట్ నియంత్రణ మండలిని కోరారు. ఈ మేరకు బుధవారం ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..90 ఏళ్లుగా తెలంగాణ జిల్లాల క్రికెటర్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ క్రికెటర్లకు అవకాశాలు కల్పించేందుకు జిల్లాలకు సంబంధించిన క్రికెట్ క్లబ్‌లకు సభ్యత్వం ఇచ్చేలా హెచ్‌సీఏను ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీసీసీఐ కార్యదర్శికి లేఖ రాసినట్లు తెలిపారు. బీసీసీఐ అందించే నిధుల్లో 50 శాతం గ్రామీణ క్రికెట్ అభివృద్ధికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

'ప్రత్యుక్తులు' గ్రంథావిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి తదితరులు

సుల్తాన్‌బజార్: తెలుగు సంస్కృత భాషల్లో వైవిధ్య భరితమైన రచనలు చేయడం డాక్టర్ మాదిరాజు బ్రహ్మానందరావు ప్రత్యేకత అని తెలంగాణ పూర్వ సలహాదారు డాక్టర్ రమణాచారి అన్నారు. బుధవారం సాయంత్రం సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవారాయ తెలుగు భాషా నిలయంలో యువభారతి, నవ్యసాహితీ సమితిల సంయుక్తాధ్వర్యంలో డాక్టర్ మాదిరాజు బ్రహ్మానందరావు రచించిన 'ప్రత్యుక్తులు'గ్రంథావిష్కరణ సభలో రమణాచారి గ్రంథ స్వీకర్తగా పాల్గొని ప్రసంగించారు. ప్రత్యుక్తులు అనే గ్రంథం సాహిత్యంలో ఒక వినూత్నమైన ప్రక్రియ అని, 232 నూతన పదాలతో, పద్యాలతో కూడిన విలక్షణ రచన అని గ్రంథకర్త బ్రహ్మానందరావు కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యువభారతి సంస్థ వ్యవస్థాపకులు ఆచార్య వంగపల్లి విశ్వనాథం, ఆచార్య ఫణీంద్ర, తెలుగు అకాడమీ పూర్వ సంచాలకులు ఆచార్య కె.యాదగిరి, ఆచార్య పతాంజలి, సాహిత్యరంగ ప్రముఖులు డాక్టర్ జోషి సంతోష్‌కుమార్, డాక్టర్ జయరాములు, వేమరాజు విజయ్‌కుమార్, బాలాజీ శర్మ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



విజయనగర్‌కాలనీ: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన బుధవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రమోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..మెహిదీపట్నం వివేకానందనగర్ కాలనీ అరబిందో జూనియర్ కాలేజ్ సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి స్పృహలేకుండా పడిపోయి ఉన్నాడని మధ్యాహ్నం 1.30 గంటలకు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలింగా అతడు అప్పటికే మృతిచెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆక్రమణకు గురవుతున్న ఆలయ స్థలం పరిశీలన



చెన్నకేశవ స్వామి ఆలయ స్థలాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ అనిత

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలోని స్వయంభూ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ స్థలంలోని ఆక్రమణలను డిప్యూటీ కలెక్టర్ అనిత, దేవాదాయశాఖ తహసీల్దార్ విజయలక్ష్మి బుధవారం పరిశీలించారు. ప్రధాన రహదారిని అనుకొని ఉన్న 2500 గజాల ఆలయ స్థలాన్ని 20 ఏళ్ల క్రితం లీజ్‌కు తీసుకున్న బద్రుకా కుటుంబసభ్యులు కొంత భాగాన్ని ఎం.వి.ఫౌండేషన్‌కు సబ్ లీజ్‌కు ఇచ్చి..మరికొంత స్థలాన్ని కాజేసేందుకు కన్నేశారు. ఈ విషయంలో ఆలయ పాలక మండలి సభ్యులు దేవాదాయశాఖకు ఫిర్యాదు చేసి గత మే నెలలో లీజ్ రెన్యూవల్‌ను అడ్డుకున్నారు. అయినప్పటికీ ఆ స్థలాన్ని ఖాళీ చేయకుండా ఉంటూ కొంత స్థలాన్ని వేరే వ్యక్తికి కట్టబెట్టి నిర్మాణం చేస్తుండడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా అతన్ని అరెస్ట్ చేశారు. ఇక్కడ జరుగుతున్న ఆక్రమణలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో కమిషనర్ ఆదేశానుసారం డిప్యూటీ కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందుకు సంబంధించిన నివేదికను పూర్తిస్థాయిలో గురువారం అందజేయాలని దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌ను ఆమె ఆదేశించారు. వారి వెంట ఆలయ కమిటీ చైర్మన్ ఎ.మహేష్ గౌడ్ ఉన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు



అంధులకు చేతికర్రలు అందజేస్తున్న కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్

సుల్తాన్‌బజార్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని బీజేపీ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ ఆధ్వర్యంలో బుధవారం అంధులకు వాకింగ్ స్టిక్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రధాని నరేంద్రమోదీ లక్ష్యం ప్రపంచ దేశాలలో భారత్‌ను అగ్రస్థానంలో నిలపడమేనన్నారు. నాయకులు శ్రీనివాస్ యాదవ్, అమర్‌సింగ్, సురేష్, రవి, రాజు యాదవ్, అనిల్ యాదవ్ పాల్గొన్నారు.

జాతీయ జెండా రెపరెపలు

చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో బుధవారం జాతీయ జెండా రెపరెపలాడింది. హైదరాబాద్ సంస్థానం దేశంలో విలీనమైన రోజును రాజకీయ పార్టీలు ఘనంగా నిర్వహించాయి. బీజేపీ ఆధ్వర్యంలో విమోచన దినోత్సవంగా, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా పాలన దినోత్సవంగా విలీన సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీల నేతలు పలుచోట్ల జాతీయ జెండాలను ఎగురవేశారు.

– చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల బృందం



గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో.. చైర్మన్ తలారి మల్లేష్ తదితరులు



మత్స్యశాఖ కార్యాలయంలో.. రాష్ట్ర ఫిషరీష్ చైర్మన్ మెట్టు సాయికుమార్



వేడుకల్లో బేగంబజార్ కార్పొరేటర్ శంకర్ యాదవ్, బీజేపీ నేత పురుషోత్తమ్‌రావు



డీఈఓ కార్యాలయంలో..డీఈఓ రోహిణి, ఏడీ శ్రీనివాస్‌రెడ్డి, కేఆర్.రాజ్‌కుమార్, భాస్కర్



గాంధీభవన్‌లో.. రాష్ట్ర పీసీసీ కార్యదర్శి మణిలాల్‌షా తదితరులు



ధూల్‌పేట్‌లో..గోషామహల్ బీజేపీ నాయకుడు సోమరాజ్ సింగ్ తదితరులు



పతాకావిష్కరణ చేస్తున్న ఉద్దడి జగదీష్ తదితరులు



గన్‌పార్కు వద్ద నివాళులర్పిస్తున్న బండారు దత్తాత్రేయ



సింగరేణి భవన్‌లో జెండా వందనం చేస్తున్న వెంకన్న



భట్టీనగర్‌లో జెండావిష్కరణ చేస్తున్న పులికంటి నరేష్



పురానాపూల్ చౌరస్తాలో.. కార్పొరేటర్ దర్శన్, సత్యనారాయణ తదితరులు



జాతీయ జెండాకు వందనం చేస్తున్న సెట్విన్ ఎండీ వేణుగోపాల్ రావు



చార్మినార్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో..



జెండాను ఆవిష్కరించిన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, విద్యార్థులు



హనుమాన్‌నగర్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర తదితరులు



ఎల్బీస్టేడియంలో జెండా ఆవిష్కరిస్తున్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి